# దివ్యత్వమే అన్నిటికీ ఆధారమైనది

**ఉత్తమాటల చేత చిత్తము సత్తు చిత్తానంద మొందదు**
**విత్తనంబులు లేని భూమిలొ మొత్తముగ పంటేమి పండదు**
**కన్ను విప్పి చూడరోరన్నా శ్రీసాయి దేవుని**
**ఎన్నగా యెందైనా గలడన్నా!**
**మున్ను షిరిడిలొ నేడు పర్తిలో ఉన్నవాడని పేరెగాని**
**తన్ను భావన చేయు భక్తుల కన్నులందే మెలగురోరన్నా!**

**విద్యార్థులారా!**

భగవంతుని ప్రేమ సర్వులయందుకూడను సమముగానే ఉంటుంది. పరిమళ పుష్పము కుడిచేతియందు ధరించినను ఎడమచేతియందు ధరించినను దాని సుగంధము ఒక్కటే. భగవంతునకు ఒకరు హితులనిగాని మరొకరు అహితులనిగాని లేరు. కానీ మానవుడు తన స్వభావమును పురస్కరించుకొని భగవంతునియందు భేదములను వెదుకుతూ వస్తాడు. అట్టి లౌకిక జ్ఞానము కలిగిన మానవుడు దైవత్వాన్ని చక్కగా గుర్తించలేడు. చేపల వ్యాపారము చేసే వ్యక్తికి రత్నాల విలువ ఏ రీతిగా తెలుస్తుంది. 'యద్భావం తద్భవతి'. తమ తమ భావములే ఈ మంచి చెడ్డలను వేర్పరచి, మంచి చెడ్డలను గుర్తింపజేసుకొని తమ విచారమునకు తాము బద్ధులౌతున్నారు. గొడ్డలి గంధపు చెట్టును నిర్దాక్షిణ్యముగా కొడుతుంది. కాని గంధపు చెట్టు కినుకను చెందక ద్వేషము పూనక తన సుగంధమును గొడ్డలి కందిస్తుంది. దివ్యత్వము అట్టిదే. మానవులు అజ్ఞానులై మోహాంధకారులై ఆడంబరము చేతను భగవంతుని అనేక విధముల మాటలాడవచ్చును, భావించవచ్చును. ఈ మాటలచేత భగవంతుని బాధించినామని తలంచవచ్చు. కాని భగవంతుడు దీనికేమాత్రము బాధపడడు. అట్టి దుష్టులకు దుర్మార్గులకు తన సద్గుణములను పవిత్ర భావములను అందిస్తూ ఉంటాడు.

srisathyasaivachanamrutam

మంచి చెడ్డలు పదార్థమునకు రెండు పార్శ్వములు. అయోధ్యావాసులు రామచంద్రునిపైన అనేక విధములుగా భక్తి ప్రపత్తులతో ఉండినారు. ప్రజలు ఎన్ని విధముల ప్రార్థించినప్పటికీ వారి మాటలను లెక్కచేయక తాను అరణ్యమునకు ప్రయాణమైనాడు. ఏ ప్రేమను, ఏ విశ్వాసమును, ఏ భక్తి ప్రపత్తులను ఈ రామునిపైన చూపుతూ వచ్చారో, ఆ ప్రజలే తమ అభీష్టమునకు విరుద్ధముగా వెళుతున్నాడనే భావముచేత అందరుకూడను రాములను కోపంగా చూస్తూ వచ్చారు. రాములు అమృత హృదయుడని భావించాము. నవనీత హృదయుడని చింతించాము. మృదు మధురమైన హృదయము కలవాడని భావించినాము. కాని ఇంతటి కఠిన హృదయుడు, ఇంతటి శిలా హృదయుడు అని మేము భావించలేదు అని దూషించారు. ఈ దూషణ భూషణలకు విరుద్ధమైన రియాక్షను. కనుకనే పదార్థముల భాగములు సుఖదుఃఖముల చేతను లాభనష్టముల చేతను, నిందాస్తుతుల చేతను కూడి ఉంటాయి. దివ్యత్వముకు మంచివారు చెడ్డవారు ఇద్దరూ బాధించే వారే. ఆస్తికులు, నాస్తికులు యిద్దరు కూడను దూషించేవారే. దివ్యత్వమును మంచివారు చెడ్డవారు హింసించేవారే. ఏమిటి ఈ హింసయొక్క అంతరార్థము? దీనిని హింస అని ఏరీతిగా మనము భావించవచ్చును. అని విచారము చేయగా మంచివారి వియోగమే దుఃఖమునకు మూలకారణము. చెడ్డవారి సంయోగమే దుఃఖమునకు మూలకారణము. ఏతా వాతా సంయోగ వియోగములు రెండును దుఃఖమునకు మూలకారణములే. కనుకనే దివ్యత్వము ఇద్దరినీ ఆశీర్వదిస్తూ వచ్చింది. ఈ ఆశీర్వాదమునకు అంతరార్థమేమిటి? చెడ్డవారి యొక్క సంయోగము, మంచి వారియొక్క వియోగము ఉండకుండా ఉండాలి అని ఆశీర్వదించాడు.

మంచివారియొక్క సంయోగమును పెంచుకోవటము, చెడ్డవారి సంయోగము తుంచుకోవటము మానవుని ప్రధానమైన సాధనము. ఈ సంయోగ వియోగములు రెండును ఒకే హృదయము నుండి ఆవిర్భవిస్తాయి. ఒకే సముద్రమునందు అమృతము, విషము రెండు ఉద్భవించాయి. అమృతము ఆనందాన్ని అందించింది. విషము బాధను కలిగించింది. అమృతము కీర్తిని పొందింది. విషము అపకీర్తి నందుకొంది. కనుకనే మానవత్వము ఏమంచి కీర్తిని సంపాదించగలదో ఆ కీర్తి నిమిత్తమై మంచిని మనము పోషించుకోవాలి. ఈనాటి మానవుడు పుణ్యఫలమును అమితముగా ఆశిస్తున్నాడుగాని, పుణ్యకార్యములకు ముందంజ

sri sathyasai vachanamrutam

వేయటం లేదు. పాప ఫలమును అంగీకరించటం లేదుగాని పాపకార్యములు చేయటానికి ముందంజ వేస్తున్నాడు. ఇదే మూలకారణము 'పుణ్యస్య ఫల మిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవాః, న పాప ఫలమిచ్ఛంతి పాపం కుర్వతి యత్నతః' అన్నారు. పాప ఫలము వద్దని నీవు విసర్జించినప్పుడు పాపకార్యములలో ప్రవేశించకు. పుణ్యఫలము నీవు ఆశించినప్పుడు పుణ్యకార్యములు చేయటానికి పూనుకో. మానవత్వము లోపల రెండు విధములైన తత్త్వములు ఉంటున్నాయి. కొందరు వ్యక్తులందు మంచి చెడ్డలు సమ్మిళితమై ఉంటుంటాయి. కాకులు చేదు నిమ్మను ఆరగిస్తాయి ఆనందిస్తాయి. కోకిల తియ్యని మామిడి చిగుళ్ళను తిని సంతోషిస్తుంది. అదేవిధముగనే కొంతమంది మానవులు లోక విషయ వాసనలు ఆశించి అందులోనే ఆనందముందని విశ్వసించి దాని నిమిత్తమై ప్రాకులాడుతుంటారు. మంచివారు దివ్యత్వము యొక్క ప్రేమతత్త్వము అనుభవించాలని అర్రులు చాస్తూ దాని నిమిత్తమై ప్రాకులాడుతుంటారు. ఈ రెండింటి తత్త్వము నందు మంచిచెడ్డలు ఇమిడి ఉంటున్నాయి. మంచిని ఎప్పుడు బాధలే వెన్నాడుతుంటాయి. ప్రాకృతమైన దృష్టిలో అది ఒక హీనమైన స్థితిగా భావిస్తూ ఉంటారు. కోరిన ఫలములు అందించేది కల్పవృక్షముగా ఉంటుండాది. విలువైన రత్నములు అందించే సముద్రము ఉప్పునీరుగా తయారైంది. కనుక ఈ మంచి చెడ్డలయందు మానవత్వాన్ని విచారించినప్పుడు వాళ్ళ అభీష్టముపైన ఈ మంచిచెడ్డలు ఆధారపడినవేగాని నిజమైన పదార్థముపైన కాదు.

మానవుడు ఉత్తమమైన భావములను చిత్తమునందు చేర్చుకొని ఆనందాన్ని అనుభవించటానికి తగిన కృషిచేయ్యాలి. మానవుడు తనయందు ప్రేమతత్త్వాన్ని పెంచుకోవాలి. ఇచ్చుకోవటము, క్షమించుకోవటము దీనివల్లనే మన ప్రేమ చింత పెరుగుతుంది. పుచ్చుకోవటం చేతను, దానిని మరచిపోవటం చేతను స్వార్థము పెరిగిపోతుంది. ఉపకారము మరచిపోవటమే స్వార్థము పెరగటానికి మూలకారణము. కనుక ప్రేమ తత్త్వాన్ని పెంచుకోవాలనుకున్నప్పుడు క్షమ, ఇచ్చుకోవటం ఈ రెండింటిని మనము పెంచుకోవాలి.

**అపవిత్రతను దరిజేరనీయకండి**

విద్యార్థులారా! ఈ లేత వయస్సునందు మానవుని మనస్తత్వము విలువ లేనిదిగా మీరు

విశ్వసిస్తున్నారు. మానవత్వము చాలా విలువైనది. పవిత్రమైనది. దివ్యమైనది అట్టి జీవితాన్ని మనము ఈనాడు స్వార్థమనే సంకుచిత భావముతో అనుభవించటం చేతనే మనకు జీవితముపై విరక్తులు ప్రవేశిస్తున్నాయి. మనము నేర్చవలసిన విద్యలు ఎన్నియో ఉంటున్నవి. నిత్య జీవితములో సత్యమైన తత్త్వాన్ని గుర్తించే నిమిత్తమై ప్రతిక్షణము ఒక్కొక్క విద్యను మనము అభ్యసించుతూ రావాలి. మాలిన్యమును మనస్సునందు చేరకుండా చూచుకోవాలి. దుష్టభావములు హృదయములో చేరినప్పటికినీ వానిని వెలుపలకు పంపించటానికి ప్రయత్నించాలి. అప్పుడే మన పవిత్రమైన చిత్తము ఉత్తమస్థితి నందుతుంది. దక్షిణామూర్తిది మౌన వ్యాఖ్యానము. వచనములతో బోధించే తత్త్వము కాదు. తన దృష్టి తోడనే విశ్వతత్త్వాన్ని ఆధ్యాత్మిక భావాన్ని గుర్తింప చేసేవాడు. ఒకానొక సమయములో ప్రయాణము చేస్తూ సముద్రము ఒడ్డుకు చేరాడు. ఓంకార శబ్దముతో నాదము గావించే సముద్రమును చూచి చాలా ఆనందించాడు. శబ్ద బ్రహ్మము నిజమైన సముద్రమే. సాగరమునకు అలలే మూలకారణము.

**కొలనుకు కలువయే శృంగారము**
**ఆకాశమునకు చంద్రుడే శృంగారము**
**సముద్రమునకు అలలే శృంగారము**
**మానవునకు గుణమే శృంగారము**
**భక్తులకు నొసట విభూతియే శృంగారము**

అన్నాడు. దక్షిణామూర్తి కూడను సముద్రమునకు అలలే శృంగారముగా భావిస్తూ వచ్చాడు. అనగా భగవత్తత్త్వమనేది ఒక సముద్రము, సర్వవిధములైన జీవులకు ఆదర్శ వంతమైనది. ఈ సంసారమును సముద్రముతో పోల్చుకున్నాడు. సముద్రములో అలలు ఒకదానిపై ఒకటి ఏవిధముగా అభివృద్ధి అవుతూ ఉంటాయో అదే విధముగానే సంసారమునందు ఒకదానిపైన ఒకటి చిక్కులు కలుగుతూ ఉంటుంటాయి. బాధలు సంభవిస్తూనే ఉంటుంటాయి. అయితే ఈ బాధలు, ఈ దుఃఖములు, ఈ విచారముల వల్ల ఒక పాఠమును మనము గుర్తించాలి. దీనికి సముద్రాన్ని ఆధారముగా తీసుకున్నాడు దక్షిణామూర్తి. చూస్తూ చూస్తూ ఉండగనే గాలికి పెద్ద చెత్త వచ్చి సముద్రములో పడిపోయింది. చెత్తపడిన తక్షణమే సముద్రుడు ఒక్కొక్క అలను మీద మీద పంపించి ఆ చెత్త గట్టుకు నెట్టించాడు. ఒక్క క్షణమైనా సముద్రము లోపల ఈ

sri sathyasai vachanamrutam

చెత్తను ఉంచుకోలేదు. దక్షిణామూర్తికి కష్టం కలిగి "సముద్రుడా! నీవెంత స్వార్థ పరుడవు. నీవు అనంతమైన, అగాధమైన లోతు ఉండినవాడవు. అలాంటి నీవు ఇంత చిన్న చెత్త నీలో ప్రవేశించిన ఓర్చుకోలేక పోయావుకదా! అంత పెద్దవాడు ఇంత చిన్న చెత్తను సహించుకోలేకపోవటం ఎంత స్వార్థము? ఎంత సంకుచిత భావము?" అన్నాడు. సముద్రుడు చక్కని జవాబు చెప్పాడు దక్షిణామూర్తికి "దక్షిణామూర్తీ! నీకు తెలియని విషయము కాదు. ఈనాడు నేను ఈ చిన్న చెత్తను నాలో ప్రవేశింప చేసుకుంటే రేపటి దినము వచ్చిన చెత్తంతా చేరిపోతుంది. నా రూపాన్నే మరుగు చేస్తుంది. కట్టకడపటికి ఈ వస్తు అంతా నా స్వరూప స్వభావాన్నే మరుగు గావిస్తుంది. కనుకనే ప్రారంభమునందే చిన్న చెత్తను కూడా నాలో చేర్చుకోకుండా ఉండినప్పుడే నేను పరిశుద్ధముగా ఉంటుంటాను. రత్నాలకు నిలయముగా నేనుంటాను" అన్నాడు. కనుకనే ప్రతి మానవుడు తనయందు కించిత్ అపవిత్రము ప్రవేశించినప్పటికీ తక్షణమే దాన్ని దూరం చేయటానికి తగిన కృషి చెయ్యాలి. చిన్నదికదా చిన్నదికదా అనుకుంటే అది కట్టకడపటికి పెద్దగా మారి నీ స్వరూపాన్నే మరుగు చేస్తుంది. నీ మానవత్వాన్నే మరిపింపచేస్తుంది. కనుక మానవత్వాన్ని వికసింప చేసుకోవాలి. అలాంటి పరిస్థితియందు మనలో కొన్ని దుర్భావములో, దుశ్చింతలో, దురాలోచనలో వచ్చినప్పుడు తక్షణమే గుర్తించి ఆ దుర్భావములను దూరము చేసుకోటానికి తగిన కృషి చెయ్యాలి.

## మనో నిగ్రహము పూనండి

ఎంత పెద్దదానినైనా చిన్నదానితో సాధించటానికి వీలవుతుంది. చిన్న చిన్న చీమలంతా చేరి గొప్ప గొప్ప సర్పాలను మరణింప చేస్తాయి. మనము చిన్నవారమనే భావమును ఏమాత్రము పెట్టుకోరాదు. మనము చేయవలసిన కర్తవ్యాన్ని నిర్వర్తించుకోటానికి తగిన శక్తిని సంపాదించుకోవాలి. లోకము లోపల మంచికి అన్నీ చెడ్డలు తగులుతూ ఉంటాయి. కోకిల గానము కాకులకు కర్ణకఠోరముగా ఉంటుంటాది. హంస రూపాన్ని చూచి కొంగలు పరిహసిస్తూ ఉంటాయి. అంతమాత్రము చేత హంసలకు పోయేదేమీ లేదు. ఇలాంటివి జగత్తులో అనేకము వెంటాడుతూనే ఉంటాయి. వెంటాడటమే కాదు రెండు జంట పక్షులవలె ఉంటాయి. మనము దీనికేమాత్రము లొంగకూడదు. వంగకూడదు. దానిని ఎదుర్కొని పోరాడి సత్యాన్ని గుర్తించి

srisathyasaivahini.org

దాన్ని సాధించాలి. విజయాన్ని సాధించాలి. సుఖశాంతులు కావాలని మనం కోరుతున్నాము. ఈ సుఖశాంతులు మనకు ఎక్కడ నుండి లభిస్తాయి? సుఖశాంతులన్నీ కేవలము మన మనోనిగ్రహం చేతనే సంభవిస్తాయి. ఈ మనో నిగ్రహము ఏరీతిగా మనకు ప్రాప్తిస్తుంది? ఒక్క దైవము యొక్క సన్నిధి చేతను పెన్నిధి చేతను మనము నిగ్రహాన్ని సాధించవచ్చు. కనుకనే భగవద్గీతయందు విజయాన్ని సాధించాలి శాంతిని అనుభవించాలి అని కోరినప్పుడు దీనికి చక్కని జవాబు అందించాడు. ఒరే పిచ్చివాడా! నీవు ఆశించేది శాంతి సుఖములు, నీవు కోరేది విజయాన్ని ఈ రెండూ నీకెట్లా లభిస్తాయి?

**యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః**
**తత్ర శ్రీర్విజయో ర్భూతిర్ధ్రువా నీతి ర్మతిర్మమ**

ఎక్కడ భగవంతుడైన కృష్ణుడుంటాడో ఎక్కడ పార్థుడు అనగా అర్జునుడు కాదు. పృధ్వీపుత్రుడైన మానవుడు ఉంటాడో అక్కడే విజయము లభిస్తుంది. కనుక విజయాన్ని ఆనందాన్ని సుఖాన్ని నీవు కోరినప్పుడు నీ హృదయము లోపల భగవంతుని ప్రతిష్ట చేసుకో. నీకు నీవు ప్రశ్నించుకున్నప్పుడు భగవంతుడెక్కడ ఉన్నాడని. నీవు నిత్యము చేసే ప్రార్థనయందే ఉంటున్నాడు. ఆ ప్రార్థన నుండియే నీకు జవాబు వస్తున్నాది. పిల్లలు నిత్యము భుజించే సమయములో అందరు కాదు కొందరు చెబుతుంటారు.

**బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం**
**బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మ కర్మ సమాధినా**

భగవంతునికి నేనర్పిస్తున్నాను అనుకుంటావు. కాని భగవంతుడేమి జవాబు చెప్పుతున్నాడు 'అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః' ఈ దేహాన్ని ధరించిన ప్రాణుల లోపల నేను వైశ్వానర రూపములో ఉండి నీవు భుజించినదంతా జీర్ణింప చేస్తున్నాను నాయనా! అని అంటున్నాడు. కనుక భగవంతుడెక్కడ ఉన్నాడని క్వశ్చన్ వేసుకుంటే 'అహం వైశ్వా నరో భూత్వా' లోపలి నుండి వస్తుండాది జవాబు. కాని ఈ జవాబు నీవు లెక్క చేయటం లేదు. నిజముగా ఈ దేహము నందు జీర్ణకోశము సరిగా పని చేయకుండిన మనము భుజించిన ఆహారము ఏమై పోతుంది?

sri sathyasai vachanamrutam

**జీర్ణ కోశాలు దేహాన చేర్చెనెవరు?**
**జనన మరణాలు ఎవరిచే జరుగుచుండె?**
**అతని గుర్తింప నేరరైరి ఈ మూఢ మానవులు**

సృష్టించటం నీ చేతనౌతుందా? మరణింప చేయవచ్చు. కాని మరణించిన వాణ్ణి బ్రతికింప నీ చేత నౌతుందా? ప్రతి ఒక్కటి కూడను భగవత్సంకల్పమే. అట్టి సంకల్పాన్ని విశ్వసించ లేకపోతున్నారు మానవులు. విశ్వాసమే లేకుండిన మానవుడు ఏమాత్రము శాంతి జీవితమును గడుపలేదు.

### భగవంతుడు సాక్షీభూతుడు

భగవద్విశ్వాసాన్ని పెంచుకోవాలి. భగవంతునికి ఆగ్రహము, అనుగ్రహము రెండూ లేవు. మీ భావాన్ని బట్టి తాను ఆడుతూ ఉంటాడు. ఒక ఇనుమును అక్కడ పెడితే ఇనుము అటు తిరగటానికిగాని ఇటు తిరగటానికిగాని స్వతః శక్తి లేదు. కాని మధ్యలో magnet పెట్టి దాన్ని ఇటు తిప్పితే ఇనుము కూడా ఇటు తిరుగుతుంది. అటు తిప్పితే అటు తిరుగుతుంది. ఈ magnet యొక్క శక్తి చేతనే ఇనుము కదలగలుగుతున్నాది. magnet లేకపోతే ఇనుమునకు యేమాత్రము చైతన్యశక్తి లేదు. కనుకనే మానవత్వము లోపల రెండు విధములైన తత్త్వాన్ని మనము గుర్తించాలి. మంచిని అందుకోవటమే కాకుండా దైవత్వములో తనకు తాను శిక్షింప చేసుకుంటున్నాడు మానవుడు. చెప్పాను. గొడ్డలి గంధపు చెట్టును కొట్టింది. కాని గంధపు చెట్టు తన సుగంధమును గొడ్డలి కందించింది. గొడ్డలిని గంధపు చెట్టు యేమాత్రము ద్వేషించలేదు. దానిని ఏమాత్రము తూలనాడ లేదు. తాను చేసిన చెడ్డ తనమునకు తానే అనుభవిస్తుంది. ఈ గొడ్డలికి వచ్చే చెడ్డ అనుభవము ఏమిటి? గొడ్డలికి అగ్ని పరీక్ష జరుగుతుండాది. గొడ్డలి సుత్తివేటు తింటుండాది. చూశారా! ఏ విధముగా సుగంధము నందుకున్నప్పటికిని గొడ్డలి తిరిగి మొద్దు బారినప్పుడు అగ్ని పరీక్ష జరుగుతున్నాది. అగ్నిలో వేస్తున్నారు గొడ్డలిని. కేవలము అగ్నిలో వేయటం మాత్రమే కాదు. సుత్తితో కొడుతున్నారు. ఈ punishment భగవంతుడిచ్చినదా? కాదు. కాదు. తాను చేసిన చెడ్డ తనమునకు ఫలితమది. భగవంతుడు మంచినిచ్చినప్పటికిని తన చెడ్డ తనమే తనకు చెడ్డ నందిస్తుండాది.

srisathyasaivachanamrutam

కనుక భగవంతుడు చెడ్డ నివ్వనక్కర లేదు. భగవంతుడు శిక్షనివ్వనక్కర లేదు. తనకు తానే శిక్షింపబడుతున్నాడు.

బంగారం మంచి విలువైనది. కంసాలి దానిని అగ్నిలోవేసి కరిగిస్తున్నాడు. విలువైన బంగారును అగ్నిలో వేసి హింసిస్తున్నప్పటికిని ఆ బంగారు ఆనందిస్తూనే ఉంటున్నాది. కారణమేమనగా నేను మరింత పరిశుద్ధమై పోతున్నాను, నేను అపరంజిగా మారుతున్నానని తానానందిస్తుండాది. వెల ఎక్కువవుతుంది దానికి. కానీ ఓ బంగారు పనివాడా! కంసాలీ! నీవు అనుభవించే బాధలను నీవు గుర్తించుకోవాలి. నీవు నన్ను ఎంత శిక్షించినప్పటికి నేను మరింత విలువైనదిగాను మరీ పరిశుద్ధమైనదిగాను అవుతున్నాను. కాని ఆ పొగచేత కన్నులు మండేది నీకే. ఆ అగ్ని నుండి వచ్చిన నెరుసులు నీ బట్టలను మలినం చేస్తున్నాది. నీ బట్టలను మాలిన్యము చేయటమే కాకుండా నీ దృష్టిని కూడా చెడుపుతున్నాది. ఇది నీకే కష్టంగానీ నాకు కాదు అంటుంది బంగారు. కనుక భగవంతుని విషయంలో మంచి చెడ్డలు ఏమాత్రము అంటవు. భగవంతుడు సాక్షీభూతుడు. నీవు switch on చేసుకుంటే Fan తిరుగుతుంది. చల్లనిగాలి వీస్తుంది. తెల్లని లైటు వస్తుంది. Switch off చేసుకుంటే వేడి నందిస్తుంది. చీకటిలో నీవు బాధపడవలసి వస్తుంది. లైటు వేయక పోవటం వలన లైటుకొచ్చే నష్టమేమీ లేదు. Fan వేసుకోకపోవటం వలన ఫ్యానుకొచ్చే నష్టమేమీ లేదు. ఆ నష్టము ఆనందము మీకు. కనుకనే నీవు ఉపయోగించుకునే విధానాన్ని రీతిలో గుర్తించాలి.

అన్నింటికిని ఆధారమైనది దైవత్వము. ఆధారమైన దానిని మనము ప్రాధేయ పడకుండా ఆధేయమైన ఈ దేహముపైన మనము ఆధారపడుతున్నాము. దీని ద్వారా మనము మోహమునకు గురౌతున్నాము. ఈ మోహముచేత విచారములో మునుగుతున్నాము. ఈ విచారము చేత శక్తినంతా కోల్పోతున్నాము. మానవుడు ఈ సుఖసంతోషముల వలన నేను భోగ భాగ్యములను భవిస్తున్నాను అనుకుంటున్నాడు. చాలా పొరపాటు. నీవు భోగాన్ని అనుభవించటం లేదు. భోగమే నిన్ను అనుభవిస్తుండాది. అందుచేతనే నీ ఇంద్రియాల పటుత్వము తగ్గిపోతుండాది. నిజముగా నీవు భోగములే అనుభవించిన వాడవయితే నీవెందుకు శక్తివంతుడు కాకూడదు. భోగములే నిన్ను అనుభవించటం చేత నీవు బలహీనుడై పోతున్నావు. వృద్ధుడై పోతున్నావు.

sri sathyasaivachanamrutam

రోగములకు గురౌతున్నావు. కనుకనే

**జన్మ దుఃఖం జరా దుఃఖం జాయా దుఃఖం పునః పునః**
**అంత్యకాలే మహాదుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత**

విద్యార్థులారా! ఈ లౌకికమైన భోగభాగ్యములు నిత్యములు కావు. సత్యములు కావు. అవి మనము కోరవలసినదే. అనుభవించవలసినదే. కాని లక్ష్యము మాత్రము దివ్యత్వమునందుంచుకోవలసిందే. కనుకనే పారమార్థిక దృష్టితో ప్రాపంచిక వ్యవహారములో మనము జీవించటము చాలా మంచిది. ఆ విధమైన జీవితమును గడిపినప్పుడే ఐహిక ఆముష్మికమైన ఆనందములు అన్నింటియందు విజయాన్ని సాధించగలము. నిత్యము ఈ పిల్లలకు చక్కని కొన్ని ఆదర్శవంతమైన అనుభూతులు, వాక్యములు వినిపించటము చేత మనము ఎంతో కొంత ఉపకారము చేసిన వారమవుతాము. ఈ కారణం చేత వారు కొన్ని మంచిగ్రంథాలు చదవటానికి ప్రయత్నిస్తారు. ప్రతిదినము ఇద్దరిద్దరు విద్యార్థులు ఒక ఆధ్యాత్మిక విషయమును గాని, మీ అనుభూతిగాని మీతోటి స్నేహితులకు అందించటము అత్యవసరము. ఇట్టి ఉత్సాహ ప్రోత్సాహములు మీకందించి పారమార్థిక తత్త్వాన్ని మీ హృదయములో ప్రవేశపెట్టే నిమిత్తమై నేను ఈ కార్యక్రమము ఈనాడు ప్రారంభించాను. లోకసంబంధమైన విషయాలలో మనము జీవితాన్ని వ్యర్థము చేయకూడదు. ఏదో మీ చదువు మీ పనులు, మీ కాలమునంతా చూస్తున్నారుగాని దినమునకు ఒక గంటైనా ఈ ఆధ్యాత్మికము మీ హృదయములో చేర్చుకోవాలి. రేపటి నుండి ఐదు గంటలకు ఈ సమావేశము ప్రారంభమై ఆరుగంటల వరకు ఉంటాయి. ఈ సత్సంగము లోపల జీవితాన్ని సార్థకం చేసుకోండి. 1st Speaker సాయినాథ్ చెప్పాడు. నామస్మరణ అనేదాంట్లో ఉన్న పవిత్రత, నామచింతనలో ఉండిన ఫలము మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. తుకారాం చెప్పాడు. నామమనే రత్నమును గుర్తించుకున్న వానికే అర్థమవుతుంది అని.

## నామస్మరణను మించినది లేదు

విద్యార్థులారా! ఇది చాలా పవిత్రమైన వయస్సు. ఈ వయస్సులోపల భగవన్నామస్మరణ అత్యవసరము. దీనిని మీరు చులకనగా భావిస్తున్నారు. చాలా పొరపాటు. లోకములో

నామముచేత సాధించలేనిది ఒక్కటి కూడను లేదు. నామిని కూడను నామము చేతనే సాధించవచ్చును. నామి అనగా రూపము. ప్రపంచములో ఒక వస్తువును మనం కొనాలంటే ఏమేమి మన చేతిలో ఉండాలి. ధనము చేతిలో ఉంటుంటే యెలాంటి వస్తువునైనా మనము కొనవచ్చు. అప్పుడు ధనము గొప్పదా లేక వస్తువు గొప్పదా? ధనమే గొప్పది. ధనము ఉంటేనే మనము వస్తువులను పొందవచ్చు. ఈ జగత్తునందున్న సుఖము సంతోషము ఆనందము ఫలము విజయము అనే వస్తువులను మనము పొందవచ్చు. ఈ జగత్తునందున్న సుఖము, సంతోషము, ఆనందము, ఫలము, విజయము అనే వస్తువులను కొనాలంటే భగవన్నామమనే ధనము మనము సాధించాలి. ఆ ధనమును మనము పోగు చేసుకోవాలి. ఆ ధనము చేతనే మనయొక్క గుణమును పోషించుకోవచ్చు. గుణమే మానవునకు ప్రధానము. ఆ గుణమనే ధనాన్ని మీరు ఈ వయస్సులో చాలా అభివృద్ధి గావించుకోవాలి.

## సంకీర్తన పవిత్రతను ప్రసాదిస్తుంది

విద్యార్థులారా! ఒక చిన్న ఉదాహరణము తీసుకోండి. మన జీవితము ఒక వృక్షము. ఈ వృక్షము లోపల మన బంధువులు మిత్రులు కొమ్మలు రెమ్మలవంటి వారు. మన thoughts ఈ చెట్టు పుష్పముల వంటివి. మనయొక్క ఆనందమనే ఫలములోపల Character అనే Juice ఉంటుండాది. కాని చెట్టుకు మూలాధారమైనది ఏది? వేరులు. క్రింద roots పైన fruits లేకపోతే యిది fire wood అవుతుంది. వృక్షము కాదు. అయితే ఈ వృక్షముపైన అప్పుడప్పుడు కామ క్రోధ లోభ మోహములోనే పక్షులన్నీ చేరిపోతుంటాయి. ఈ పక్షులు చేరటం చేత ఏమి జరుగుతుండాది. కేవలము అలజడి కలిగిస్తుండాది. చెట్టు క్రింద అశుద్ధము చేస్తుండాది. అందువల్లనే ఈ వృక్షము క్రింద మనము చేరి, చెట్టుపైన చేరిన పక్షులను ఏరీతిగా తరిమికొడుతున్నాం. ఇష్ ఇష్ అన్నప్పుడు నోటి శబ్దం చేతను చేతి శబ్దము చేతను అవన్నీ పరుగెత్తిపోతాయి. కాబట్టి దేహమనే ఈ చెట్టు లోపల హృదయమనే స్థానములో నీవు కోరి 'రామ కృష్ణా గోవిందా' అని శబ్దము చేస్తే ఆ పక్షులంతా పరుగెత్తిపోతాయి. మనస్సులో పుట్టిన రామా, కృష్ణా అనేది వాక్కులో రావాలి. వాక్కులో వచ్చిన దానికి ఈ చేతులు తాళము వెయ్యాలి. వాక్కనే పాటకు మనస్సనేది శృతి చేతులు అనేది తాళము. శృతిలయ రాగ తాళములతో

srisathyasaivachanamrutam

కూడినప్పుడే మనకు త్రికరణ శుద్ధి జరుగుతుంది. చాలా మంది పిల్లలనుకుంటారు. నేను మనసులో పాడుకుంటానులే బయటకు చెప్పాలా అని. ఇది పూర్తి అజ్ఞానము. వంట ఇంట్లో ఉంటుండాది వంట. నేను మనసులో అనుకుంటే చాలనుకున్నావా? నీకు తట్టలోకి రావాలి. తట్టలోది పొట్టలోకి చేరాలి. అప్పుడుగాని నీ ఆకలి తీరదు. కాబట్టి మనస్సులో ఉంటే ప్రయోజనము లేదు. మనస్సులోది మాటలోకి రావాలి. మాటలో వచ్చింది నీ కర్ణములో చేరిపోవాలి.

విద్యార్థులారా! దారి తప్పి నడచిన మానవులకు దేహము ప్రమాదములో చేరుతుంది. నీతి తప్పి నడచిన మానవునకు మానవత్వము కోల్పోతుంది. మనము మానవత్వాన్ని కోల్పోయేటట్టుగా చేసుకోకూడదు. కొంతమంది పాటలు పాడుతూ పెదవులు అల్లాడిస్తూ ఉంటారు. అది సరియైనది కాదు. బావిలో పడిన వ్యక్తి నేను బావిలో పడ్డా అని మెల్లగా అంటే ఎవరూవచ్చి రక్షించరు. అయ్యో! నేను బావిలో పడ్డానని గట్టిగా అరిచేటప్పటికి చుట్టు ప్రక్కలవారంతా వచ్చి రక్షిస్తారు. అదేరీతిగానీ హృదయమనే బావిలో పడినటువంటి నీవు యేదో లోపల తలచుకుంటూ ఉంటానంటే రాదు. గట్టిగా చెప్పాలి. అదియే సమ్యక్ కీర్తనం యితి సంకీర్తనం అన్నారు. గొంతు ఉండినంతవరకు దీనిని ఎత్తి పాడాలి. ఎందుకు గొంతు ఇచ్చినది. పిచ్చి పిచ్చి మాటలు చెప్పుకోవటానికా! చెప్పుకోవచ్చు. భగవన్నామమునకు హద్దే లేదు. సంకీర్తనము స్వాతంత్ర్యముగా పాడాలి. ఏ విధమైన అదుపులు పెట్టుకోకూడదు. మన S.Kumar చెప్పుతుంటాడు. ఊ ఊ అని. ఒక పదము కూడను స్పష్టముగా రాదు. పదములు స్పష్టముగా రావాలి. 'రామా' అనేది మెల్లగా రామా అనుకుంటే ఎట్లా ఉంటుంది? కంఠమును చక్కగా ఎత్తి నాలుకను చక్కగా కదలించి సుస్వరముతో భజన చేయాలి. ఇంకొకటి కూడా మీరు గుర్తించాలి. మనము పాడే పాటలు మనము మాత్రమే కాదు వినేది. వేలమంది వింటున్నారు. వారి హృదయానికి ఆనందాన్నందించే రీతిగా మనము పాడాలి.

నీకు నీవు ఈ ఆనందాన్ని నింపుకొని ఇతరులకు కూడనుఈ ఆనందాన్ని పంచాలి. Street light ఉంటుంటాది. మీరు చూశారా? ఈ Street lightలో బల్బులంతా పెట్టి ఉంటారు. ఆ లైటు పోలుపై ఉంటుంది. కాని ఆ లైటు రోడ్డులో నడిచేవారికి వెలుగు చూపిస్తుంది.

srisathyasaivachanamrutam

తన రూపాలు కూడా తాను చూపుకుంటుంది. అదేరీతిగా ఈ భజన తనకుతాను తృప్తిగావాలి. ఇతరులకు తృప్తి చెయ్యాలి. follow చేసేవారు ఎట్లా చేసినా ఫరవాలేదు. కాని lead చేసేవారు చక్కగా చెయ్యాలి. Lead చేయవలసిన వారు చక్కగా Practice చేసుకోండి. ఎన్నో వేలమంది వినేవారుంటారనే విషయాన్ని మీరు గుర్తుపెట్టుకోవాలి. శృతి లయ రాగ తాళములతో కూడి ఉండాలి. దానితో వచ్చినదే మన దేశమునకు పేరు. మన దేశము పేరు ఏమిటి? భారతదేశము. భా-ర-త మూడు అక్షరములతో కూడిన పదము. భావరాగతాళములతో కూడినదే మన భారతదేశము. అప్పుడే దేశమునకు సరైన సార్థకత నందించిన వారమౌతాము.

విద్యార్థులారా! హృదయ పూర్వకముగా గొంతెత్తి స్వేచ్ఛగా మీరు పాటలు పాడుతూ రావాలి. సామూహిక భజన చాలా సార్థకమైనది. దీనిని మొట్టమొదట గురునానక్ స్థాపించాడు. కేవలము వ్యక్తి వ్యక్తి మాత్రమే పాడుకుంటే ప్రయోజనము లేదు. అందరి గొంతులు ఒక దగ్గర చేరాలి. అందరి చేతులు ఒక శబ్దములో చేరాలి. అందరి హృదయాలు ఒకదానిలో చేరాలి. కాబట్టి అందరు కలసి ఒక్క స్వరముతో పాడితే ఎంత ఆనందముగా ఉంటుంది. శ్రవణానందముగా ఉంటుంది. ఒక్కొక్కరు ఒక్కొక్క రకముగా పోతే కర్ణ కఠోరముగా ఉంటుంది. ఈ భజనల ద్వారా దివ్యత్వాన్ని అందుకోవటానికి కృషి చేయండి. దేనిని మనము చింతిస్తామో ఆ రూపాన్ని మనము పొందుతాము. కనుకనే హృదయాన్ని చేర్చి ప్రేమతో భగవంతుని నామమును మీరు స్మరించాలి.

ఈనాడు లోకములో ఇలాంటి పవిత్రమైన వాతావరణము లేకపోవటం చేత భావములు చలించిపోతున్నాయి. విద్యార్థులారా! ఒక విషయాన్ని గుర్తించండి. మనం పీల్చుకొనేగాలి ఎక్కడ ఉంటుందాది? సర్వత్రా ఉంటుందాది. ఈ గాలిలో ఏమిచేరి ఉన్నాయి. దుశ్శబ్దములంతా చేరి ఉంటున్నాయి. ఈ గాలిని మనము లోపల చేర్చుకోవటం చేతనే మనలో దుర్భావములంతా చేరుతున్నాయి. ఎట్టి మంటనో అట్టి పొగ. ఎట్టి పొగనో అట్టి మేఘము. ఎట్టి మేఘమో అట్టి వర్షము. ఎట్టి వర్షమో అట్టి పంట. ఎట్టి పంటనో అట్టి వంట. ఎట్టి పుడ్డో అట్టి హెడ్డు. కనుక మన తల చెడిపోవటానికి మూలకారణం ఏమిటి? మనం పీల్చుకునే గాలిలో ఉన్న దోషములే.

srisathyasaivachanamrutam

ఢిల్లీలోనో, మద్రాసులోనో, బెంగుళూరులోనో ఎక్కడో ఆకాశవాణి శబ్దాలంతా ఈ గాలిలో ఉంటున్నాయి. ఇట్టి శక్తి శబ్దములంతా సర్వత్రా వ్యాపించి పోతున్నాయి. దానినే మనం పీల్చుకుంటున్నాము.

కాబట్టి ఏవోవో దుర్భావములు దుశ్శక్తులంతా ఈ శబ్దములలో చేరుతుంటాయి. ఏమిటి ఈ అర్థములేని songs అంతా చేరిపోతున్నాయి ఈ గాలి లోపల. ఏదో రేడియో వేస్తారు. బజారులో పెండ్లి కోసమని గ్రామఫోన్ రికార్డు వేస్తుంటారు. దీనిలో అర్థములేని పాటలంతా వస్తుంటాయి. అవన్నీ ఈ గాలిలో చేరుతున్నాయి. దానిని మనము పవిత్రము చేయాలి. సుందరయ్య చెప్పాడు Pollution అని. ఆ యొక్క దీనిని పవిత్రము చేసుకుంటూ రావటానికి నామస్మరణ అత్యవసరము. మనము భగవన్నామాన్ని చేయకపోతే ఆవే వచ్చి మనలో చేరుతుంటాయి. అర్థములేని పదాలు సార్థకము గావించాలంటే దైవనామాన్ని ఆధారం చేసుకోవాలి. లేకపోతే ఆ tape recorderలో వస్తుంటాయి. లేకపోతే గ్రామఫోను ప్లేటులో వస్తుంటాయి డడడా డడడా ఏమిటిది? ఇలాంటి పాటలంతా వస్తుంటాయి. ఈ పాటలు మనలో చేరతాయి. మనము డడడా అయిపోతాము. దీనివలన వచ్చే ఫలితమేమిటి? రామాకృష్ణా గోవిందా అనే శబ్దాలంతా వస్తే మనలో ఆ శబ్దాలు ప్రవేశిస్తాయి. మన నుంచి కూడను ఆ శబ్దాలు ఆవిర్భవిస్తాయి.

విద్యార్థులారా! మీరు చక్కగా భగవత్తత్వాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నించండి. స్వామి ఇక్కడ ఏ కార్యక్రమము, ఏ చిన్న విషయము తలచినప్పటికిని ఒక అంతరార్థముతోనే కూడి ఉంటుందిగాని అర్థములేని పనులు ఇక్కడ ఏమాత్రం జరగటం లేదు. అది ఈ స్థితిలో ఈ పరిస్థితిలో మీకు అర్థము కాదు. క్రమక్రమేణా దీన్ని తెలుసుకొని కొంతవరకు అనుభవించటానికి పూనుకుంటారు. కనుక భగవన్నామస్మరణను అలక్ష్యము చేయకండి. విశ్వాసాన్ని పెంచుకోండి. ఈనాడు లోకములో ఆ విశ్వాసము లేకపోవటం చేతనే అనేక రకములైన దుర్మార్గాలు జరుగుతున్నాయి. లోకములో చదువులు లేకుండా పోలేదు. చదువుకున్నవారు కావలిసినంత మంది ఉన్నారు. కాని వారియందు చిత్తశుద్ధి లేదు. ఇంద్రియ నిగ్రహము లేదు. మొన్న చెప్పాను. రావణుడు అరువది నాలుగు విద్యలు చదువుకున్నాడు. రాముడు ముప్పది నాలుగు

sri sathyasai vachanamrutam

విద్యలు మాత్రమే నేర్చుకున్నాడు. విద్యా విజ్ఞానము లోపల రామునికంటె గొప్పవాడు రావణుడు. కాని రామునకు, రావణునకు ఉండిన వ్యత్యాసము యేమిటి? ఇంద్రియములను నిగ్రహించుకున్నవాడు రాముడు. ఇంద్రియములకు వశమైనవాడు రావణుడు. కనుకనే వాల్మీకి 'రావణో నామ మూర్ఖః' రావణుడు పరమమూర్ఖుడు అన్నాడు. విద్య లేదా రావణునికి ఉంది. విద్య ఉంటుండి కూడా ఇంద్రియాలకు వశమైపోయాడు. కనుక sensesను control చేసుకోటానికి తగిన కృషి చెయ్యాలి. అవి మనం control చేయకపోతే మనలను అన్ని విధాలా భ్రష్టు పట్టిస్తాయి. మన మానవత్వాన్నే ముంచివేస్తాయి. అపకీర్తుల పాలు చేస్తాయి కనుక నామస్మరణ మీరు ఆధారం చేసుకొని దీనినే ఒక నావగా భావించుకొని సంసారమనే సాగరాన్ని దాటటానికి పూనుకోండి.

**(తేది. 18-06-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam